


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
27-12-2024
పేజీలు: 02






# మన్మోహన్ సింగ్ ఇక లేరు

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ (92) గురువారం రాత్రి కన్నుమూశారు. చాలా కాలంగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న మాజీ ప్రధాని, గురువారం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత ఆయన్ను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఢిల్లీలో చేర్చారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా ఉన్నారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన భారతదేశంలో ఆర్థిక సరళీకరణకు పునాది వేశారు. ఇది ప్రపంచ స్థాయిలో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. అవిభక్త భారతదేశంలోని పాకిస్థాన్ పంజాబ్‌లోని గాహ్ గ్రామంలో 1932 సెప్టెంబర్ 26న మన్మోహన్ సింగ్ జన్మించారు. పంజాబ్ విశ్వవిద్యాలయం, కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు. 1957-59లో ఆర్థిక శాస్త్రంలో సీనియర్ అధ్యాపకులుగా పనిచేశారు. 1959 నుంచి1963 మధ్య కాలంలో రీడర్‌గా ఉద్యోగం చేశారు. 1963 నుంచి 1965 పంజాబ్ వర్సిటీ, చండీగఢ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1966 నుంచి1969 వరకు ఐక్యరాజ్య సమితిలో వాణిజ్య వ్యవహారాల అధికారిగా పనిచేశారు. 1969 నుంచి 1971 మధ్య ఢిల్లీ వర్సిటీ, అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1972-76 ఆర్థికశాఖలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా ఉన్నారు. 1976 నుంచి 1980 వరకు రిజర్వు బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. ఐడీబీఐ డైరెక్టర్, ఆసియా అభివృద్ధి బ్యాంకు భారత్ విభాగం గవర్నర్, ఐబీఆర్‌డీ భారత విభాగం గవర్నర్‌గా మన్మోహన్ సేవలందించారు. 1982-85 మధ్య ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు మన్మోహన్ సింగ్. 1985-87 మధ్య కాలంలో ప్రణాళికా సంఘం అధిపతిగా పనిచేశారు మన్మోహన్ సింగ్.

అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు మన్మోహన్ సింగ్. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు మన్మోహన్ సింగ్. 1998 నుంచి 2004 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఐదుసార్లు అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు మన్మోహన్ సింగ్. 2004లో సార్వత్రిక ఎన్నికల్లో యూపీఏ కూటమి గెలిచాక 13వ భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు మన్మోహన్ సింగ్. 2004 నుంచి 2014 వరకు రెండుసార్లు దేశ ప్రధానిగా పనిచేశారు. పదేళ్ల పాటు సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా పనిచేసి దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశారు . ప్రధానిగా రోజుకు 18 గంటలు పనిచేశారు మన్మోహన్ సింగ్. పార్లమెంటు సభ్యుడిగా దాదాపు 33 ఏళ్ల పాటు కొనసాగారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ కీలక సమయాల్లో ఓపిగ్గా సభకు వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు మన్మోహన్ సింగ్. 1987లో మన్మోహన్ సింగ్ పద్మ విభూషణ్ అవార్డు అందుకున్నారు. 2017లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 1993, 94లో ఉత్తమ ఆర్థిక మంత్రిగా యూరో మనీ అవార్డు అందుకున్నారు.2010లో మన్మోహన్ సింగ్‌ను వరల్డ్ స్టేట్స్ మెన్ అవార్డు వరించింది. ఫోర్బ్స్ అత్యంత శక్తివంతుల జాబితాలోనూ మన్మోహన్‌కు చోటు దక్కింది. మన్మోహన్ సింగ్ మృతితో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలన్నీ రద్దు చేసింది కేంద్రం. ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరగనున్నాయి.

## రేపు రాజ్‌ఘాట్‌లో అంతిమ సంస్కారాలు!

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ దిగ్భ్రాంతి వ్యక్తి చేశారు. అంత్యక్రియల కార్యక్రమం ఇంకా ఖరారు కాలేదన్నారు. విదేశాల్లో ఉన్న మన్మోహన్ కూతురు రావల్సి ఉందన్నారు. ఆమె మధ్యాహ్నం లేదా సాయంత్రం వస్తున్నారు. ఆ తర్వాతే అన్నీ నిర్ణయిస్తామన్నారు. రేపు శనివారం అంత్యక్రియలు జరిగే అవకాశం ఉంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు రేపు రాజ్‌ఘాట్ సమీపంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు. రేపు(శనివారం) ఉదయం 8-10 గంటల మధ్య ఆయన భౌతికకాయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఉంచనున్నారు. అనంతరం మాజీ ప్రధానికి అంతిమ వీడ్కోలు జరగనుంది.

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంతాపం

భారత మాజీ ప్రధాని, దేశ సీనియర్ నాయకుడు డాక్టర్ సర్దార్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల యావత్ దేశం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. సాధారణ నేపథ్యం నుండి వచ్చినప్పటికీ, భారతదేశానికి మన్మోహన్ సింగ్ చేసిన సహకారం ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కొనియాడు. ఆయన అత్మకు శాంతి చేకూరాలని, మోక్షాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

### మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా సంతాపం

అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ J. బ్లింకెన్ భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపారు. US డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ విడుదల చేసిన ఒక ప్రకటనలో, "మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణించినందుకు భారతదేశ ప్రజలకు యునైటెడ్ స్టేట్స్ తన సంతాపాన్ని తెలియజేస్తుంది. డా. మన్మోహన్ సింగ్‌కు గొప్ప మద్దతుదారులలో ఒకరు. యుఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్యం. గత రెండు దశాబ్దాలలో మన దేశాలు కలిసి సాధించిన అనేక విజయాలకు అతని కృషి పునాది వేసింది." అని పేర్కొన్నారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణలను గుర్తు చేసుకున్నారు. భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించిన మన్మోహన్ సింగ్ మరణానికి సంతాపం తెలియజేశారు.

### దేశ ఆర్థిక సరళీకరణ రూపశిల్పి: ఉపరాష్ట్రపతి

దేశ ఆర్థిక పరిస్థితిని మార్చిన మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి చెందడం తనకు చాలా బాధ కలిగించిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఆయన దేశ ఆర్థిక సరళీకరణకు రూపశిల్పి. ముఖ్యమైన మార్పుల ద్వారా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాడు. ఆయన అభివృద్ధి, శ్రేయస్సు కొత్త మార్గాలను తెరిచారని కొనియాడారు.

### ఆయన సింప్లిసిటీని మాటల్లో చెప్పడం అసాధ్యం: కేజ్రీవాల్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంతాపం వ్యక్తం చేస్తూ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని అన్నారు. ఆయన వివేకాన్ని, సరళతను మాటల్లో చెప్పడం అసాధ్యం. భగవంతుడు ఆయన పాదాల చెంత పుణ్యాత్మునికి స్థానం కల్పించాలని కేజ్రీవాల్ ఆకాంక్షించారు.

### ఓ గురువును, మార్గదర్శినిని కోల్పోయాను: రాహుల్ గాంధీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మన్మోహన్ సింగ్ తెలివితేటలు, విధేయతతో దేశాన్ని నడిపించారు. ఆర్థిక శాస్త్రం పట్ల ఆయనకున్న వినయం, అవగాహన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాయి. ఒక గురువును, మార్గదర్శినిని కోల్పోయానంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఎమోషనల్ అయ్యారు. ఆయన అభిమానులైన లక్షలాది మంది ఆయనను ఎంతో గర్వంగా గుర్తుంచుకుంటారని తెలిపారు.



### ఆర్థిక వ్యవస్థను గడలో పెట్టిన నిష్కళంకమైన నేత: రాష్ట్రపతి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆ దేశ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచంలో విద్యారంగంలో, పరిపాలనలో సమాన సాలభ్యంతో పనిచేసిన రాజకీయ నాయకులలో మన్మోహన్ సింగ్ ఒకరని ఆమె అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, నిష్కళంకమైన రాజకీయ జీవితం, అత్యంత వినయంతో ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన మరణం మనందరికీ తీరని లోటు. ఆయన కుటుంబానికి రాష్ట్రపతి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### నిజాయితీ మాకు స్ఫూర్తిని నిలుస్తుంది: ప్రియాంక గాంధీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్దార్ మన్మోహన్ సింగ్ ఇచ్చిన గౌరవాన్ని రాజకీయాల్లో చాలా తక్కువ మంది మాత్రమే ప్రేరేపిస్తారన్నారు. ఆయన నిజాయితీ మనకు ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ దేశాన్ని నిజంగా ప్రేమించే వారిలో ఆయన ఎప్పుడూ ఉంటారు. అతను నిజంగా సమతావాది, తెలివైనవాడు, దృఢ సంకల్పం, ధైర్యవంతుడని ప్రియాంక గాంధీ కొనియాడారు.

### భారతావని ఒక గొప్ప కుమారుడిని కోల్పోయింది: రేవంత్ రెడ్డి

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త, మహా నాయకుడు, సంస్కరణ వాది అన్నింటికి మించి గొప్ప మానవతావాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక గొప్ప కుమారుడిని కోల్పోయిందని సీఎం అవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి మృతిపై సోషల్ మీడియా X లో తన సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని సీఎం తెలియజేశారు. నిర్ణయాల తీసుకోవడంలో సమగ్రత, పారదర్శకత అన్నింటికీ మించి మానవీయ స్పర్శను జోడించేవారని, నవ భారత శిల్పుల్లో మన్మోహన్ సింగ్ ఒకరని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. రాజకీయ, ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు ఎలా పాటించాలో ఆయన తన ప్రవర్తన ద్వారా చూపించారని సీఎం పేర్కొన్నారు.

### 7 రోజుల పాటు జాతీయ సంతాప దినాలు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూశారు. దేశానికి రెండుసార్లు ప్రధానిగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఆయన మృతితో కేంద్ర ప్రభుత్వం నేడు జరగాల్సిన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేసింది. దేశ వ్యాప్తంగా 7 రోజులపాటు జాతీయ సంతాప దినాలు ప్రకటించారు. నేడు ఉదయం 11 గంటలకు మంత్రివర్గ సమావేశం జరగనుంది. ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరగనున్నాయి.

దేశానికి రెండు సార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ కన్నుమూశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా ఉన్నారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన భారతదేశంలో ఆర్థిక సరళీకరణకు పునాది వేశారు. ఇది ప్రపంచ స్థాయిలో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. గత కొంతకాలంగా శ్వాస సమస్యలతో ఇబ్బందిపడుతోన్న ఆయనను గురువారం(డిసెంబర్ 26) ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్‌ను ప్రత్యేక వైద్యుల బృందం పరీక్షించింది. చివరకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య గురుశరణ్ కౌర్ ఎయిమ్స్‌లో ఉన్నారు. ఆమెతోపాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఎయిమ్స్‌కు చేరుకున్నారు. ఎయిమ్స్ క్యాంపస్‌ను ఢిల్లీ పోలీసులు ఖాళీ చేయించారు. ప్రియాంక గాంధీ కూడా ఎయిమ్స్‌కు చేరుకున్నారు.



## ఘన నివాళులర్పించిన ప్రధాని మోదీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రధాని మోదీ నివాళులర్పించారు. భారత విశిష్ట నేతల్లో మన్మోహన్ సింగ్ ఒకరు.. మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై బలమైన, చెరగని ముద్ర వేశారు. రాజకీయాల్లో తనతో గత క్షణాలను గుర్తు చేసుకున్నారు. తాను ప్రధానిగా ఉన్నప్పుడు, నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిత్యం మాట్లాడుకునేవాళ్లమన్నారు మోదీ. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ అంశాలపై లోతైన సంభాషణలు జరిగేవి. అతని తెలివితేటలు, వినయం ఎప్పుడూ కనిపించేవి. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు ప్రధాని మోదీ. సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి గౌరవనీయమైన ఆర్థికవేత్తగా, ఆర్థిక మంత్రితో సహా వివిధ ప్రభుత్వ పదవులలో పనిచేశారు. సంవత్సరాలుగా మన ఆర్థిక విధానాలపై తీవ్ర ప్రభావాన్ని చూపారు. పార్లమెంటులో ఆయన ఆలోచనాత్మకమైన జోక్యాలు కూడా ఎల్లప్పుడూ గుర్తించదగినవి. ప్రధానిగా ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు విస్తృతంగా కృషి చేశారని ప్రధాని మోదీ కొనియాడారు.



# మాక్స్ రివ్యూ

ఈ క్రిస్మస్ కానుకగా రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో కన్నడ అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్ హీరోగా నటించిన అవైటెడ్ మాస్ యాక్షన్ డ్రామా "మాక్స్" కూడా ఒకటి. అయితే కన్నడలో ఈ డిసెంబర్ 25న రిలీజ్ అయ్యిన ఈ చిత్రం తెలుగులో ఈ 27న వచ్చింది. మరి ఈ చిత్రం తెలుగు ఆడియెన్స్ అంచనాలు అందుకుందో లేదో సమీక్షలో చూద్దాం రండి. ఇక కథలోకి వస్తే.. మాక్స్ గా పిలవబడే అర్జున్ మహాక్షయ్ (కిచ్చా సుదీప్) సాలిడ్ ట్రాక్ రికార్డుతో చాలా చోట్ల తన చర్యలతో ట్రాన్స్ఫర్ లు, సస్పెన్షన్ లు అవుతూ ఆఖరికి ఓ పోలీస్ స్టేషన్ కి సీఐ గా ఛార్జ్ తీసుకోవాల్సి వస్తుంది. అయితే ఆ స్టేషన్ లో తాను ఇంకా ఛార్జ్ తీసుకోవాల్సిన సమయం కంటే ముందే తన యాక్షన్స్ స్టార్ట్ చేసేస్తాడు. ఈ నేపథ్యంలో ఆ పోలీస్ స్టేషన్ కి ఇద్దరు మంత్రుల కొడుకులని డ్రగ్స్, లేడీ పోలీస్ తో అసభ్యంగా ప్రవర్తించినందుకు జైల్లో వేస్తారు. అయితే అనూహ్యంగా వీరిద్దరూ అదే పోలీస్ స్టేషన్ లో అనుమానాస్పదంగా చనిపోతారు. దీనితో ఇది మాక్స్ అండ్ టీం కి పెద్ద సమస్యలా మారేలా వెళుతుంది. ఈ క్రమంలో మాక్స్ చేసిన ప్లానింగ్స్ ఏంటి? వాళ్లిద్దరూ ఎలా చనిపోయారు? ఎందుకు చనిపోయారు? మాక్స్ తన టీం కోసం ఏం చేస్తాడు అనేది తెలియాలి అంటే ఈ చిత్రంని వెండితెరపై చూడాల్సిందే. ఈ చిత్రంలో బిగ్గెస్ట్ హైలైట్ ఏదన్నా ఉంది అంటే అది అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్ అనే చెప్పాలి. ఈ సినిమా తన ఫ్యాన్స్ కి మాత్రమే కాకుండా మాస్ ఆడియెన్స్ కి ఒక ఫీస్ట్ లా సాగుతుంది అని చెప్పొచ్చు. మెయిన్ గా సుదీప్ స్క్రీన్ ప్రెజెన్స్ ఈ చిత్రంలో సూపర్బ్ గా ఉంది. దానికి తోడు తనపై స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్ లు అన్నీ మంచి ట్రీట్ ని అందిస్తాయి. అలాగే సుదీప్ నటన తన మ్యానరిజంలు కానీ సినిమాలో మెప్పిస్తాయి. దీనితో తన సైడ్ నుంచి మాత్రం ఒక కంప్లీట్ ఫీస్ట్ ని




అందిస్తాడు అది డెఫినెట్ గా అందరూ ఎంజాయ్ చేస్తారని చెప్పొచ్చు. ఇక ఇది కాకుండా తాను చేసే కొన్ని ప్లానింగ్స్ అలాగే మైండ్ గేమ్ సీక్వెన్స్ లు ఇంట్రెస్ట్ గా సాగుతాయి. అలాగే ఈ సినిమాలో ముఖ్య పాత్రల్లో కనిపించిన వరలక్ష్మి శరత్ కుమార్ తన నెగిటివ్ షేడ్ ఉన్న పోలీస్ పాత్రలో మెప్పిస్తారు. అలాగే సునీల్ కూడా తన రోల్ లో సాలిడ్ పెర్ఫామెన్స్ అందించారు ఇక వీరితో పాటుగా తమిళ్ నుంచి కన్నడ నుంచి ఉన్న కొందరు ప్రముఖ నటులు తమ పాత్రలకి పూర్తి న్యాయం చేకూర్చారు. ఇక వీటికి మించి సినిమాలో ఇంకా ఇంప్రెస్ చేసే అంశం ఏదన్నా ఉంది అంటే అది యాక్షన్ సీక్వెన్స్ లలో సాగే బ్యాక్గ్రౌండ్ స్కోర్ అని చెప్పాలి. అజనీష్ లోకనాథ్ సాలిడ్ వర్క్ మంచి మాస్ అండ్ స్టైలిష్ బీట్స్ తో పలు సీన్స్ ని బాగా ఎలివేట్ చేసాడు. అలాగే క్లైమాక్స్ ట్విస్ట్ బాగుంది. ఈ సినిమాలో మాస్ ని అలరించే అంశాలు ఉన్నాయి కానీ సరైన కథ లేదని చెప్పాలి. సినిమాలో కనిపించే సెన్సిటివ్ పాయింట్ చాలా రొటీన్ గా అనిపిస్తుంది. ఇంకా దీనికి తోడు కొన్ని సీన్స్ లో మాస్ డైలాగ్స్ లాంటివి కూడా చాలా సినిమాల్లో వినేసినట్టే ఉంటాయి. దీనితో ఇవి కొంచెం రొటీన్ ఫీల్ కలిగిస్తాయి. ఇక వీటితో పాటుగా సినిమాలో బ్యాక్ డ్రాప్ కూడా మనకి కార్తీ "ఖైదీ" తరహాలోనే అనిపిస్తుంది. ఇంకా సుదీప్ తో ఉండే గ్యాంగ్ నటీనటులు సినిమాలో కొంచెం ఓవర్ యాక్షన్ లా చేస్తారు. మెయిన్ గా ప్రీ క్లైమాక్స్ లో సుదీప్ తో పోలీస్ స్టేషన్ లో ఓ సీన్ లో సుదీప్ తో మాట్లాడే డైలాగులు చాలా అతి గా అనిపిస్తాయి. దర్శకుడు ఇలాంటి వాటిని తగ్గించి ఉంటే సినిమా ఇంకా నాచురల్ గా ఫీస్ట్ అందించి ఉండేది. ఇంకా కొన్ని సీన్స్ ఊహించదగిన విధంగానే ఉంటాయి. వీటితో పాటుగా సుదీప్ బ్యాక్ స్టోరీ కోసం ఏమన్నా చూపించి బాగుండేది. అంత ఎలివేషన్స్ తనకి ఇచ్చి సింపుల్ గా ముగించేసినట్టుగా చిన్న అసంతృప్తి తన రోల్ విషయంలో ఉంటుంది. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు దాదాపు బాగున్నాయని చెప్పొచ్చు. మెయిన్ గా ఒక్క రాత్రిలో నడిచే సినిమాగా మంచి విజువల్స్ తో తెరకెక్కించారు. ఇందులో సాంకేతిక టీం కి మంచి మార్కులు ఇవ్వొచ్చు. మెయిన్ గా సినిమాటోగ్రఫీ, సంగీతం చాలా ప్లస్ అయ్యాయి. కొన్ని సీన్స్ లో కెమెరా మూమెంట్స్, అజనీష్ స్కోర్ లు సాలిడ్ గా ఇంప్రెస్ చేస్తాయి. తెలుగు వెర్షన్ డబ్బింగ్ బాగుంది. అలాగే ఎడిటింగ్ కూడా పర్వాలేదు. కొన్ని చోట్ల వి ఎఫ్ ఎక్స్ చాలా వీక్ గా ఉన్నాయి. ఇక దర్శకుడు విజయ్ కార్తికేయన్ విషయానికి వస్తే.. తాను రొటీన్ లైన్ నే తీసుకున్నప్పటికీ మాస్ ఆడియెన్స్ కి ఒక సగటు ప్రేక్షకుడికి బోర్ కొట్టకుండా సినిమా నడిపించడంలో సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. మెయిన్ గా రేసి స్క్రీన్ ప్లే సినిమాలో ఎంగేజ్ చేస్తుంది. మంచి మాస్ మూమెంట్స్ తో సుదీప్ స్క్రీన్ ప్రెజెన్స్ ని తాను బాగా వాడుకొని డీసెంట్ ట్రీట్ ని అయితే అందించారు. దీనితో ఈ సినిమాకి తన వర్క్ బాగుంది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "మాక్స్" చిత్రం మాస్ ఆడియెన్స్ కి సుదీప్ ఫ్యాన్స్ కి మంచి మాస్ ట్రీట్ ఇస్తుంది. ముఖ్యంగా సినిమాలో మాస్ యాక్షన్ మూమెంట్స్ వీటికి మించి సుదీప్ సాలిడ్ స్క్రీన్ ప్రెజెన్స్ లు సినిమాలో మెప్పిస్తాయి. కాకపోతే కొంచెం రొటీన్ లైన్ ఇవి మినహా ఈ సినిమా అయితే ఆడియెన్స్ కి ఎంగేజ్ చేస్తుంది.



## కొరడాతో కొట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న నిరసన తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆరు కొరడా దెబ్బలు కొట్టుకుని నిరసన తెలిపారు అన్నామలై. అంతేకాదు డీఎంకే సర్కార్‌ను దించేవరకు చెప్పులు వేసుకోనని ప్రతిజ్ఞ చేశారు. తమిళనాడు రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయనే చెప్పాలి. డీఎంకేను అధికారం నుంచి దించే వరకు తాను పాదరక్షలు వేసుకోబోనని బీజేపీ చీఫ్ అన్నామలై ప్రకటించారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదంటూ.. ఇకపై తాను రెగ్యులర్ రాజకీయాలు చేయబోనని అన్నారు. అన్నా యూనివర్శిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనపై అన్నామలై ప్రెస్‌మీట్ పెట్టారు. 19 ఏళ్ల ఇంజనీరింగ్ విద్యార్థి వివరాలు ఉన్న ఎఫ్ఐఆర్ లీక్ అవ్వడంపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. రాష్ట్ర పోలీసులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. బాధితురాలే భయపడేలా పోలీసులు ఎఫ్ఐఆర్ రాయడాన్ని ఖండించారు. డీఎంకే ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అన్నా యూనివర్శిటీ లైంగిక వేధింపుల కేసులో నిందితుడైన జ్ఞానశేఖరన్ గతంలో కూడా నేరాలు చేశాడని అన్నామలై ఆరోపించారు. డీఎంకే నేతలతో ఉన్న కారణంగా పోలీసుల ఆయనపై రౌడీ షీట్ తెరవలేదని విమర్శించారు. డీఎంకే ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఇవాళ తనకు తాను కొరడా దెబ్బలు కొట్టుకున్నారు. డీఎంకేను గద్దె దించేందుకు ఇవాళ్టి నుంచి 48 రోజుల పాటు ఉపవాస దీక్ష చేస్తున్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు దర్శించుకున్నారు. తన భర్త వెంకట దత్తసాయి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సింధు దంపతులకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సింధు దంపతులు స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## మీ సేవ పేరుతో నకిలీ వెబ్‌సైట్

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ విజృంభిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ సైట్ meeseva.telangana.gov.in కాగా meesevatelangana.in పేరుతో నకిలీది సృష్టించారు. కొత్తగా మీ సేవ కేంద్రాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామంటూ HYD కలెక్టర్ పేరుతో ఫేక్ ఉత్తర్వులు రూపొందించారు. అది చూసి చాలా మంది ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. ఈ స్కామ్‌పై సైబర్ సెల్ దర్యాప్తు చేస్తోంది. నకిలీ సైట్‌ను బ్లాక్ చేసింది.

## జనవరి 1 నుంచి ఈ మార్పులు

గత కొన్ని నెలలుగా స్థిరంగా ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. కార్ల ధరలు పెంచుతామని ప్రకటించిన పలు కంపెనీలు కొత్త ఏడాది నుంచి వాటిని అమల్లోకి తీసుకురానున్నాయి. దీంతో పాటు NBFC, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల ఫిక్సడ్ డిపాజిట్లలో నిబంధనలతో పాటు GST పోర్టల్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. యూపీఐ 123పే ట్రాన్సాక్షన్ లిమిట్ రూ.5వేల నుంచి రూ.10వేలకు పెరగనుంది.

# బీఎస్ఎన్ఎల్ గుడ్‌న్యూస్

బీఎస్ఎన్ఎల్ మరింత డేటా అవసరమయ్యే కోట్లాది మంది వినియోగదారులకు ఉచిత డేటా ఆఫర్‌ను తీసుకొచ్చింది. మీరు కూడా ఏదైనా పని చేస్తే, దాని కోసం మీకు రోజువారీ మొబైల్ డేటా తక్కువగా వస్తుంది. ఇప్పుడు బీఎస్ఎన్ఎల్ ఈ టెన్షన్‌కు స్వస్తి పలికింది. బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు 1 నెల పాటు ఉచిత ఇంటర్నెట్‌ని పొందే ప్లాన్‌ను తీసుకువచ్చింది. బీఎస్ఎన్ఎల్ అద్భుతమైన బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది. రెండు ప్లాన్‌లలో కంపెనీ వినియోగదారులకు 1 నెల పాటు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్‌ను అందిస్తోంది. రెండు బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌ల ధర 500 రూపాయల కంటే తక్కువ. మీరు తక్కువ ఖర్చుతో ఎక్కువ డేటాను పొందవచ్చు. కంపెనీ రెండు ప్లాన్‌ల గురించి తెలుసుకుందాం.బీఎస్ఎన్ఎల్ పండుగ ఆఫర్‌లో ఉచిత డేటాను ఇస్తోంది. కంపెనీ తన ఫైబర్ బేసిక్ నియో, ఫైబర్ బేసిక్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌లతో ఈ ఆఫర్‌ను అందిస్తోంది. మీరు ఒకేసారి మూడు నెలలపాటు ఏదైనా ప్లాన్ తీసుకున్నప్పుడు మాత్రమే మీరు ఉచిత ఇంటర్నెట్ ప్రయోజనం పొందుతారు.
బీఎస్ఎన్ఎల్ ఫైబర్ బేసిక్ నియో ప్లాన్ ఆఫర్: బీఎస్ఎన్ఎల్ ఫైబర్ బేసిక్ నియో ప్లాన్ ధర రూ.449 మాత్రమే. ఈ ప్లాన్‌లో మీరు నెలకు 3.3TB డేటాను పొందుతారు. అంటే మీరు ఒక నెలలో 3300GB డేటాను ఉపయోగించవచ్చు. ఇది మీకు 30Mbps హై స్పీడ్ కనెక్టివిటీని అందిస్తుంది. ఇది మొబైల్‌లో అందుబాటులో ఉన్న డేటా వేగం కంటే చాలా ఎక్కువ. మీరు మొత్తం 300GB డేటాను వినియోగించుకుంటే, మీరు 4Mbps వేగం పొందుతారు. బీఎస్ఎన్ఎల్ ఫైబర్ బేసిక్ నియో ప్లాన్‌తో మీరు అన్ని నెట్‌వర్క్‌లకు ఉచిత కాలింగ్ కూడా పొందుతారు. మీరు కలిసి 3 నెలల ప్లాన్‌ను కొనుగోలు చేస్తే, మీరు ప్లాన్‌పై రూ. 50 తగ్గింపు కూడా పొందుతారు.



## కొత్త రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం?

కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్హుల ఆదాయపరిమితి ప్రస్తుతం గ్రామాల్లో ₹1.50L, పట్టణాల్లో ₹2L ఉండగా, దాన్ని మరో ₹20K పెంచుతారని తెలుస్తోంది. ప్రజా పాలనలో 10L దరఖాస్తులు రాగా JAN మొదటి వారం నుంచి మరో అవకాశం ఇవ్వాలని యోచిస్తోంది. కార్డుల్లో మార్పులపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తారని సమాచారం. 30న జరిగే క్యాబినెట్ భేటీలో తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

## జైస్వాల్ 9వ హాఫ్ సెంచరీ

యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ కొట్టాడు. మెల్‌బోర్న్ టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో అతను నిలకడగా ఆడుతున్నాడు. టెస్టుల్లో 9వ హాఫ్ సెంచరీ నమోదు చేశాడతను. 81బంతుల్లో జైస్వాల్ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. మూడవ సెషన్‌లో కోహ్లీ, జైస్వాల్ ఆచితూచి ఆడుతున్నారు. కోహ్లీ కూడా నెమ్మదిగా స్కోరింగ్ చేస్తున్నాడు. ఆ ఇద్దరూ మూడో వికెట్‌కు ఇప్పటి వరకు 79 రన్స్ జోడించారు. తాజా సమాచారం ప్రకారం ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 130 రన్స్ చేసింది. జైస్వాల్ 65, కోహ్లీ 30 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.



## సంధ్య థియేటర్ ఘటన.. నాంపల్లి కోర్టుకు అల్లు అర్జున్

సంధ్య థియేయర్ ఘటనలో ప్రముఖ హీరో అల్లు అర్జున్ మరోసారి నాంపల్లి కోర్టుకు హాజరుకానున్నారు. గతంలో విధించిన 14 రోజుల రిమాండ్ నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరికాసేపట్లో కోర్టుకు రానున్నారు. అయితే ఇదే కేసులో అల్లు అర్జున్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. బెయిల్ ఇచ్చిన విషయాన్ని ఆయన లాయర్లు కోర్టు దృష్టికి తీసుకురానున్నారు.
పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనపై అరెస్టయిన అల్లు అర్జున్‌కు ఈ నెల 13న హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసింది. రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచలగూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. తొకిసలాటలో మరణించిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు చికడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు చేయకుండా బెయిల్ మంజూరు చేయాలంటూ



అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఎదుట సుదీర్ఘ వాదనలు జరిగాయి. అల్లు అర్జున్‌తోపాటు సంధ్య థియేటర్ యజమానులు ఇద్దరికి మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. ఇంకా అరెస్ట్ కాని ఇతర నిందితుల్లో నలుగురు సంధ్య థియేటర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఉత్తర్వులను జారీచేశారు.